క్లుప్తంగా

ఘనంగా శత్రుచర్ల పుట్టినరోజు వేడుక



విజయరామరాజుకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, బేబినాయన

జియ్యమ్మవలస: మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు 77వ పుట్టినరోజు వేడుకలను చినమేరంగిలోని తన స్వగృహంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కురుపాం నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్రతో పాటు నాయకులు దత్తి లక్ష్మణరావు, డొంకాడ రామకృష్ణ, పల్ల రాంబాబు, తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పూడికలు తీయిస్తున్న ఫాల్గుణరావు

భామిని: మండలంలోని ఘనసర కాలనీలో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ కిల్లారి కమల, వైఎస్సార్‌సీపీ కార్యదర్శి కిల్లారి ఫాల్గుణరావు నేతృత్వంలో పారిశుద్ధ్య కార్మికులు కాలువల్లోని పూడికలు తొలగించారు. వ్యర్థాలను ట్రాక్టర్‌పై డంపింగ్‌యార్డుకు తరలించారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

అక్షరబ్రహ్మ ఉద్యమం కొనసాగించాలి



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న అక్షరబ్రహ్మ ప్రచారకులు

భామిని: సవర భాషా లిపి ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రచారం చేయాలని శ్రీఅక్షరబ్రహ్మ యువ నిర్మాణ సేవా సంఘం ప్రచారకులు ఆదివారం పిలుపునిచ్చారు. మండలంలోని మనుమకొండ అక్షరబ్రహ్మ ఆలయ సమీపంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో వారు మాట్లాడుతూ..సవరభాష, లిపి కనుమరుగు కాకుండా విస్తృతంగా ప్రచారం చేయాలని, భాషాభివృద్ధికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. గుమ్మలక్ష్మీపురం ఏరియా పెద్దగూడ బ్రాంచ్ ఏరియా కోఆర్డినేటర్ ఆనందరావు ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏవైఎస్ డైరెక్టర్లు కామేశ్వరరాం, తిరుపతి, ముత్యాలు, అడ్డాయి, బాంబు, పొట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

చినకుదమలోనే ఏనుగుల గుంపు



పంట పొలాల్లో ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని చినకుదమ గ్రామం పంట పొలాల్లో మూడు రోజుల నుంచి ఏనుగులు సంచరిస్తున్నాయి. అరటి పంటను ఏనుగులు ధ్వంసం చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.ఆరు అడవి ఏనుగుల గుంపు కుదమ పంచాయతీ పరిధిలో సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఆదివారం చిన కుదమలోని చెరకు పంటలో ఏనుగులు సంచరించడంతో రైతులు లబోదిబో మంటున్నారు. ఏనుగులను అడవికి పంపించే ఏర్పాట్లు చేయాలని రైతులు అటవీ సిబ్బందిని కోరుతున్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు

సీతానగరం: మండలంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండల కేంద్రమైన సీతానగరంతో పాటు సమీప గ్రామాల్లో దమ్ము పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఈ విషయమై ఏఓ అవినాష్ మాట్లాడుతూ, వరి ఉబాలకు వాతావరణం అనుకూలంగా ఉండడంతో వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయని చెప్పారు.

రక్షకభటులకే రక్షణ కరువు

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసుల కోసం ఏర్పాటు చేసిన సిగ్నల్ పాయింట్ అత్యంత దారుణంగా తయారైంది. ఎప్పుడు పడిపోతుందో తెలియక పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కొత్త పాయింట్ ఏర్పాటు చేయాలని ట్రాఫిక్ పోలీసులు, ప్రజలు కోరుతున్నారు.



భామిని: బొడ్డగూడలో విద్యార్థులకు చెట్టు కిందే తరగతుల నిర్వహణ..



గరుగుబిల్లి ప్రాథమిక పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

పాలకొండ, కురుపాం నియోజకవర్గంలో పాఠశాలల వివరాలు

మండలం	మొత్తం పాఠశాలలు	విద్యార్థులు
పాలకొండ	59	4533
వీరఘట్టం	62	5742
సీతంపేట	167	10502
భామిని	64	6334
గుమ్మలక్ష్మీపురం	172	9540
గరుగుబిల్లి	58	3550
జియ్యమ్మవలస	96	4166
కొమరాడ	127	6015



గుమ్మలక్ష్మీపురం మండలం తోలుఖర్దలో పునాది స్థాయిలో ఆగిపోయిన పాఠశాల భవన నిర్మాణ పనులు



పాలకొండ పెద్దకాపువీధిలో అర్ధాంతరంగా నిలిచిన జెడ్పీ ఉన్నత పాఠశాల అదనపు భవనాల నిర్మాణ పనులు

నాడు పురోగమనం..
నేడు తిరోగమనం

- సర్కారు బడులపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు
- పూర్తిస్థాయిలో అందని విద్యా కిట్లు
- సక్రమంగా అమలుకాని మధ్యాహ్న భోజన మెనూ



జియ్యమ్మవలస: నాడు-నేడు కింద అభివృద్ధి చేసిన బిత్రపాడు ఎంపీయూపీ పాఠశాల



కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు పురోగతి దిశగా అడుగులు వేస్తే.. నేడు కూటమి ప్రభుత్వంలో తిరోగమణం దిశగా సాగుతున్నాయని విద్యార్థులు, వారి తల్లితండ్రులు చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలను కొనసాగించాల్సింది పోయి అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. 'తల్లికి వందనం' పథకం కింద ఎంతమంది పిల్లలు బడికి వెళ్తే అందరికీ రూ.15 వేలు చొప్పున అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా కసరత్తు పేరుతో కాలయాపన చేస్తూ అమ్మలకు పంగనామాలు పెట్టింది. గత ప్రభుత్వం నాడు-నేడు కింద చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపు నిలిపివేసింది. దీంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మధ్యాహ్న భోజన పథకం పేరు మార్చి విద్యార్థుల తల్లిదండ్రులను ఏమార్చే ప్రయత్నం చేశారు. పథకం నిర్వాహకులకు బకాయిలు చెల్లింపులు ఆలస్యం చేస్తుండటంతో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందని పరిస్థితి నెలకొంది. ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పూర్తి చేయకపోవడంతో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత నెలకొంది. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలైనా ఇంకా కొందమంది విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందని పరిస్థితి.

గిరిశిఖర గ్రామల్లో ఉపాధ్యాయాల కొరత

కొమరాడ మండలంలోని దిగవ గుణద, ఎగువ గుణద, పూసనంది, గుజ్జబడి గ్రామల్లో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు లేకపోవడం విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారు. కొన్ని గిరిజన గ్రామల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ పాఠశాలలకు రాకుండా తమ సొమ్ముతో విద్యా వలంటీర్లను నియమించి పబ్బం గడుపుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో..

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని భావించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు చేపట్టారు.విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారు. నాడు-నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు భవనాలు, మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారు. అనతికాలంలోనే ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్ల మాదిరిగా తీర్చిదిద్దారు. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందజేసి చదువులను ప్రోత్సహించారు. గోరుముద్ద పథకం కింద నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారం అందించేవారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన పథకాల ద్వారా ప్రభుత్వం ఆర్థిక సాయం అందించింది. ఇలా చెప్పుకుంటూ పోతే గత ప్రభుత్వం విద్యారంగానికి సరికొత్త ఊపిరి అందించింది. ఈ నేపథ్యంలో ప్రైవేటు బడుల హవా తగ్గింది. సర్కారు బడిలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపేవారు. ఉత్తమ ఫలితాలు వస్తుండటంతో తల్లి తండ్రులకు ప్రభుత్వ బడిపై భరోసా కలిగింది.

ప్రభుత్వ పాఠశాల ఉన్నా..

కొమరాడ మండలంలోని విక్రంపురం గ్రామంలో జిల్లా పరిషత్ పాఠశాలలో గత ప్రభుత్వం అన్ని వసతులు కల్పించినప్పటికీ ఉపాధ్యాయులు సరైన బోధన చేయకపోవడంతో విద్యార్థులు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కోటిపాం జిల్లా పరిషత్ పాఠశాలకు వెళ్లిపోతున్నారు. విక్రంపురం ఉన్నత పాఠశాల నుంచి సుమారు 70 మంది విద్యార్థులు కోటిపాం పాఠశాలలో చేరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు

సాక్షి ఎఫెక్ట్



అట్టలి మలుపు వద్ద జంగిల్ క్లియరెన్స్‌పై సూచనలు చేస్తున్న డీఎస్పీ

పాలకొండ రూరల్: సమస్యలు ఉన్న చోట తక్షణ చర్యలు చేపట్టి రోడ్డు ప్రమాదాలను సమర్థవంతగా అదుపు చేయాలని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు ఆదేశించారు. ఇటీవల సాక్షి పత్రికలో 'పొంచి ఉన్న ప్రమాదం' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్‌తో కలిసి పాలకొండ-పార్వతీపురం-రాయిగడ అంతరాష్ట్ర రహదారిలో ఉన్న ప్రమాదకర మలుపును ఆదివారం పరిశీలించారు. గోతులు, రోడ్డుకు ఇరువైపులా పెరిగిన జంగిల్ కారణంగా వాహన చోదకులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా గుర్తించారు. ముఖ్యంగా స్థానిక అగ్నిమాపక కేంద్రం కూడలి, అట్టలి మలుపు, రాజుపేట కూడలి, తదితర ప్రాంతాలను సందర్శించి ఆయా ప్రాంతాల్లో చేపట్టాల్సిన తక్షణ చర్యలపై పలు సూచనలు చేశారు. ముందుగా జంగిల్ క్లీరెన్స్ చేయాలని ఎస్సైకి సూచించారు.

ఏరియా ఆస్పత్రిలో బెడ్‌ల కొరత



ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్న రోగితో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో బెడ్‌ల కొరత వేధిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు అన్నారు. గిరిజన సంఘ సభ్యులతో కలిసి ఆదివారం ఆస్పత్రిని స్వయంగా సందర్శించారు. రోగులు పడుతున్న ఇబ్బందులను గమనించారు. ఒక్కో బెడ్‌పై ఇద్దరు ఉండి చికిత్స పొందే పరిస్థితి ఉందన్నారు. బెడ్‌లు అందుబాటులో లేకపోవడంతో రిఫరల్ కేసులు పెరుగుతున్నాయన్నారు. అదనపు భవనాలు సకాలంలో పూర్తికాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణాలు పూర్తి చేసి అదనపు బెడ్‌లు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పి.సాంబయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా..



బిల్లుమడ వద్ద ఇసుక లారీను అడ్డుకుని డ్రైవర్‌ను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

పాలకొండ రూరల్: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. భామిని మండలం బిల్లుమడ, నేరడి గ్రామాల మధ్య శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలను బిల్లుమడ గ్రామస్తులు అడ్డుకున్నారు. నిత్యం రాత్రి 10 నుంచి వేకువజాము వరకూ ఇసుకను లారీల్లో విశాఖ తరలిస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో లారీల రాకపోకలు సాగిస్తున్నాయని, ఈ క్రమంలో ప్రమాదలు సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. స్థానియ యువత అక్రమ రవాణాపై లారీ డ్రైవర్లను నిలదీయడంతో లారీలను వెనకకు తరలించారు. దీన్ని యువత తమ సెల్‌ఫోన్లలో వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరల్‌గా మారింది. అయినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని గ్రామస్తులు వాపోతున్నారు. వంశధార నదీ తీరం నుంచి ఇసుక తరలింపులు పెద్ద ఎత్తున జరుగుతున్న ట్లు ఇటీవల పత్రికల్లో వార్తలు వచ్చాయి. దీనిపై స్పందించిన రెవెన్యూ, ఇతరశాఖల అధికారులు ఇసుక తరలిస్తున్న ప్రాంతాలను సందర్శించారు. ఈ తర హా చర్యలకు ఎవరూ పాల్పడినా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. అయినా ఫలితం లేకపోయిందని, ఉన్నతాధికారులు దీనిపై స్పందించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న తిరుపతిరావు

భామిని: ఈ నెల 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవంలో గిరిజనులంతా పాల్గొని విజయవంతం చేయాలని గిరిజన సంఘ నాయకులు ఎం.తిరుపతిరావు పిలుపు నిచ్చారు. భామిని మండలం జోకులగూడలో గిరిజన సంఘ మండల అధ్యక్షుడు కొండగొర్రి మిన్నారావు అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. గిరిజనుల సమస్యలపై, ఆదివాసీ దినోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. ఐటీడీఏ పరిధిలో నిర్వహించే కార్యక్రమాలను వివరించారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ప్రాంతంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి విష జ్వరాల బారి నుంచి గిరిజనులను కాపాడాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ నాయకులతో కలిసి ఆదివారం ఆయన మాట్లాడుతూ.. జ్వరపీడితులతో భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం కిటకిటలాడుతోందని, సరిపడా బెడ్లు అందుబాటులో లేకపోవడంతో ఒక్కో బెడ్డుపై ముగ్గురు చొప్పున రోగులు చికిత్స తీసుకుంటున్నారన్నారు. గిరిజన గ్రామాల్లో విష జ్వరాలు విజృంభిస్తున్నా వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం వహించడం బాధాకరమన్నారు. గిరిజన గ్రామాల్లో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి, వైద్య శిబిరాలు నిర్వహించాలని, ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను జిల్లా కలెక్టర్, గిరిజన సంక్షేమ శాఖామంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు.

29న మూడోవిడత కౌన్సెలింగ్

సీతంపేట: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మూడోవిడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 26వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, 27న ఏదైనా ప్రభుత్వ ఐటీఐలో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ నెల 29న కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్, మెకానికల్, కోపా, డ్రెస్ మేకింగ్ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

కొమరాడ: పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కేరళ రాష్ట్రంలో వరద బాధితులకు విరాళాలు సేకరిస్తున్నట్లు సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి తెలిపారు. కొమరాడ మండలంలో ఆదివారం విరాళాలు సేకరించారు. రూ.4,325లు సేకరించి పార్టీ జిల్లా కమిటీకి అందజేసినట్లు చెప్పారు. కేరళ వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని కోరారు. దాతల నుంచి సేకరించిన మొత్తాన్ని కేరళ సీఎం సహాయ నిధికి అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఎ జిల్లా కార్యవర్గ సభ్యులు వాకాడ ఇందిర, ఏపీ రైతు సంఘం నాయకులు ఉపేంద్ర, జగన్నాథం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, గిరిజన సంఘం నాయకులు వెంకటేష్, బోడయ్య, సుందరరావు పాల్గొన్నారు.

'చదవడం మాకిష్టం'



గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థులు

గరుగుబిల్లి: స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహిస్తున్న 'చదవడం మాకిష్టం' కార్యాక్రమంలో భాగంగా ఆదివారం విద్యార్థులతో పద్యాలు, నవలలు, నీతి కథలు చదివించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకుడు ఎస్.మధుసూదనరావు విద్యార్థులకు వివరించారు. ప్రముఖ సంఘ సంస్కర్తల జీవిత చరిత్రను, సమాజంలో చైతన్యం తీసుకొచ్చేందుకు వారు చేసిన కృషిని విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో బొమ్మలు వేయించడం, ఆటలు ఆడించడం వంటి కృత్యాలు నిర్వహించారు.

జిల్లా ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చాలి

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రిలో సౌకర్యాలు మెరుగుపర్చాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఆస్పత్రి స్థాయి పెంచి, నిధులు కేటాయించినా.. భవన నిర్మాణాలు, ఆధునీకరణ పనులు సకాలంలో పూర్తికాకపోవడంతో రోగులు, వారి సహాయకులు నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. ఆస్పత్రిలో అన్ని రకాల వసతులు కల్పించడంతో పాటు రిఫరల్ కేసులు తగ్గించి రోగులకు మెరుగైన వైద్యం అందించేలా అధికారులు, పాలకులు కృషిచేయాలని కోరారు.

సస్యరక్షణపై అవగాహన

పాలకొండ రూరల్: వరి పంట కీలక దశలో ఆశించి కాండంతొలుచు పురుగు నివారణపై రైతులు అవగాహన పెంచుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ కె.రత్నకుమారి అన్నారు. మండలంలోని డోలమడ, జంపరకోట, ఎం.సింగుపురం తదితర ప్రాంతంలో ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి రైతులకు సస్యరక్షణపై అవగాహన కల్పించారు. నారుమడి దశ నుంచి ఈనిక దశ వరకూ కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉందన్నారు. ఆలస్యంగా నాట్లు వేసినప్పుడు, ముదురు నారు వినియోగించటం వలన, నత్రజని ఎరువులు అధికంగా వాడినా ఈ పురుగు ఆశిస్తుందన్నారు. దీని కారణంగా నారు మడిలో పిలక దశలో మొవ్వ చనిపోవటం, ఈనిక దశలో కంకి పాలు పోసుకోకపోవటం, తెల్ల కంకి వంటివి చోటుచేసుకుంటాయని తెలిపారు. నారు మడుల్లో కార్బోఫ్యూరాన్ 3జీ 800 గ్రాములు మడిలో పలుచగా ఇంకేటట్లు చల్లుకోవాలని సూచించారు. పిలక దశలో అవే గుళికలు ఎకరాకు 10 కేజీలు వాడుకోవచ్చు. సమస మరింత ఉధృతంగా ఉంటే అధికారుల సూచనల మేరకు ఎరువులు వాడాల్సి ఉంటుందన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పాలకొండ రూరల్: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ శివారులో జూదం ఆడుతున్న 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. సిబ్బందితో కలిసి ఆదివారం పికెట్ నిర్వహిస్తుండగా పేకాట ఆడుతున్నవారిని చూసి పట్టుకున్నట్లు ఎస్సై చెప్పారు. వారి నుంచి రూ.10 వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

ప్రారంభమైన గణనాథుల సందడి



స్థానిక ఆర్‌సీఎం పాఠశాల సమీపంలో అమ్మకాలకు సిద్ధం చేసిన గణపతి విగ్రహాలు

పాలకొండ రూరల్: సర్వమత సమ్మేళనానికి నాంది పలికే గణపతి ఉత్సవాలు మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఈ క్రమంలో డివిజన్ కేంద్రం పాలకొండలో విఘ్నేశ్వరుని ప్రతిమల అమ్మకానికి స్థానిక యువత సిద్ధం చేశారు. వివిధ రూపాల్లో గణనాథుని మట్టివిగ్రహాలను తయారు చేస్తున్నారు. విగ్రహ పరిమాణాన్ని బట్టి రూ.500 నుంచి రూ.20 వేల వరకు ధరలు పలుకున్నాయి. పాలకొండ పట్టణంతో పాటు ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పరిధిలోని పలు మండలాల నుంచి ఉత్సవ నిర్వాహకులు, యువత ఈ విగ్రహాల కొనుగోలుకు ఉత్సుకత చూపుతున్నారు. వారికి నచ్చిన వాటిని ఎంపిక చేసుకుని అడ్వాన్సులు చెల్లిస్తున్నారు.